సాక్షి
ప్రకాశం
ఆదివారం । 15 । అక్టోబర్ । 2023



అభివృద్ధే సీఎం లక్ష్యం

రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే సీఎం వైఎస్ జగన్ లక్ష్యమని మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. - 10లో..



ప్రజారోగ్యంపై సీఎం ప్రత్యేక శ్రద్ధ

ప్రజారోగ్యంపై సీఎం జగన్‌కు ప్రత్యేక శ్రద్ధ ఉందని వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి అన్నారు. - 10లో..

గరిష్టం/కనిష్టం
34.9/26.7

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉక్కపోత అధికం. వాతావరణంలో తేమ శాతం అధికం. రాత్రి చలిగాలులు వీస్తాయి.

సాగర్ సవ్వడి..

వరుణుడు ముఖం చాటేసినా 'సాగర్' జలాలు జిల్లావాసుల దాహార్తిని తీరుస్తున్నాయి. జిల్లాలో నెలకొన్న పరిస్థితులను అర్థం చేసుకున్న రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది మూడు దఫాలుగా 15 టీఎంసీల సాగర్ నీళ్లను అందించింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి క్రమం తప్పకుండా సాగర్ కుడి కాలువ ద్వారా నీటిని అందిస్తూనే ఉంది.

- వరుసగా జిల్లాకు సాగర్ జలాలు
- ఈ ఏడాది తాగునీటి కోసం 15 టీఎంసీలు విడుదల
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కొదువలేకుండా సాగర్ జలాలు
- నాలుగేళ్లపాటు ఖరీఫ్, రబీ సీజన్లకు పుష్కలంగా నీళ్లు
- ఈ ఏడాది నైరుతీ ముఖం చాటేసినా.. ఇబ్బందిలేకుండా చర్యలు
- జిల్లాకు చేరిన సాగర్ జలాలు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 2019 జూన్ నాటి నుంచి జిల్లాకు క్రమం తప్పకుండా సాగర్ నీటిని అందిస్తూనే ఉంది. వరుణుడి కరుణతో ఏటా సంవృద్ధిగా వర్షాలు కురిశాయి. అలాగే జిల్లా అవసరాలకు తగ్గట్టుగా క్రమం తప్పకుండా నాగార్జున సాగర్ కుడి కాలువ ద్వారా నీటిని వదలడంతో జిల్లాలోని అనేక ప్రాంతాల్లోని చెరువులు, కుంటలు, చలమలు, ప్రాజెక్టులు నీటితో నిండు కుండల్లా తొణికిసలాడాయి. దీంతో తాగు, సాగు నీటి కష్టాలు కూడా తీరిపోతూ వస్తున్నాయి. కరువు అనే మాట వినిపించలేదు.

నాలుగేళ్లు పుష్కలంగా...

సాధారణంగా జిల్లాకు తాగు, సాగునీటి అవసరాల కోసం దాదాపు 60 నుంచి 65 టీఎంసీల వరకు అవసరమవుతాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి ఏటా సాగర్ నీటిని జిల్లాకు వదులుతూనే ఉన్నారు. 2019-20లో 60.57 టీఎంసీలు, 2020-21లో 67 టీఎంసీలు, 2021-22లో 60 టీఎంసీల నీరు జిల్లాకు విడుదల చేశారు. 2022-23లో 63 టీఎంసీలు జిల్లాకు వచ్చి చేరాయి. దీంతో జిల్లాలోని ప్రజలు అటు తాగునీటికి ఇటు సాగు నీటికి ఇబ్బందులు లేకుండా పోయింది.

ఈ ఏడాది తాగునీటి అవసరాలకు 15 టీఎంసీలు:

నైరుతి రుతు పవనాలు ముఖం చాటేయడంతో సకాలంలో వర్షాలు కురవలేదు. అప్పుడప్పుడూ జిల్లాలో కురిసిన భారీ, అతిభారీ వర్షాల వల్ల భూగర్భ జలాలు కొంత వరకూ మెరుగుపడ్డాయి. వర్షాలు పడకపోయినా జిల్లా ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు అధికార యంత్రాంగం పూర్తి స్థాయిలో కసరత్తు చేసింది. మరో పక్క మంత్రి ఆదిమూలపు సురేష్, మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి ప్రత్యేకంగా ముఖ్యమంత్రితో మాట్లాడి తాగునీటి అవసరాలకు ఇబ్బంది లేకుండా చేసుకుంటూ వస్తున్నారు. మార్చి నెలలో ఒంగోలు నగరానికి 1.50 టీఎంసీల సాగర్ నీటిని విడుదల చేయించారు. అదేవిధంగా గతంలో జిల్లాలోని మొత్తం 137 తాగునీటి చెరువులకు కూడా తాగునీటి కోసం సాగర్ నీటితో నింపారు. మార్చిలో 5 టీఎంసీలు, జూలైలో మరో 5 టీఎంసీలు సాగర్ నీటిని ఇవ్వడంతో అన్ని చెరువులను నింపి జిల్లా ప్రజల వేసవి దాహార్తి తీర్చి ఇబ్బందులు లేకుండా చేశారు. తిరిగి అక్టోబర్‌లో మరో 5 టీఎంసీల సాగర్ జలాలు జిల్లాకు విడుదలయ్యాయి. ఈ నెల 20వ తేదీ వరకు జిల్లాలోని రామతీర్థం జలాశయం, గుండ్లకమ్మ ప్రాజక్టుతో పాటు 98 గ్రామీణ తాగునీటి చెరువులు, 4 ఎస్ఎస్ ట్యాంకులు నింపేందుకు అధికారులు ఇప్పటికే కసరత్తు చేపట్టారు.

సాగర్ జలాలను కూడా రాబట్టలేని టీడీపీ ప్రభుత్వం..

జిల్లాకు సాగర్ జలాలు రాబట్టడంలో నాటి టీడీపీ ప్రభుత్వం తీవ్రంగా వైఫల్యం చెందింది. దీనికి తోడు వాతావరణం అనుకూలించకపోవటం.. వరుణుడు సైతం కరుణించకపోవడంతో అటు తాగు...ఇటు సాగునీటికి జిల్లా ప్రజలు నానా అవస్థలు పడ్డారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి వివరాలు, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత సాగర్ జలాలు ఏవిధంగా జిల్లాకు వచ్చాయో ఈ లెక్కలు చూస్తే అర్థమవుతుంది. 2015వ సంవత్సరంలో 25 టీఎంటీలు మాత్రమే జిల్లాకు సాగర్ జలాలు వచ్చాయి. 2016వ సంవత్సరంలో 4.64 టీఎంసీలు, 2017లో 20.25 టీఎంసీలు, 2018లో 36.22 టీఎంసీలు మాత్రమే సాగర్ నీటిని జిల్లాకు విడుదల చేశారు.



సాగర్ ప్రధాన కాలువ ద్వారా సరఫరా అవుతున్న నీరు

పంటల సాగు వివరాలు ఖరీఫ్, రబీ సీజన్లు కలుపుకొని

సంవత్సరం	పంటల సాగు (హెక్టార్లలో)
2018-19	4,92,616
2019-20	4,78,324
2020-21	5,19,476
2021-22	3,47,718
2022-23	4,93,781
2023 ఖరీఫ్	1,43,720 (ఈ ఖరీఫ్‌లో మొత్తం 2,17,095 హెక్టార్లలో సాగు చేయాల్సి ఉంది)

వర్షపాతం

సంవత్సరం	సాధారణ వర్షపాతం	కురిసిన వర్షపాతం (మిల్లీ మీటర్లలో)
2017	871.5	423.1
2018	871.5	600.2
2019	871.5	876.6
2020	871.5	893.2
2021	871.5	1012.3
2022	871.5	1105.6

సాగర్ కాలువలపై నిఘా



జిల్లాకు తాగునీటి అవసరాల కోసం సాగర్ కుడి కాలువ నుంచి 5 టీఎంసీలు కేటాయించారు. దీంతో ఇప్పటికే సాగర్ కుడి కాలువ ద్వారా నీరు జిల్లాకు చేరాయి. అందుకోసం జాయింట్ కలెక్టర్ పర్యవేక్షణలో సాగర్ కాలువలపై నిఘా ఏర్పాటు చేశాం. ఆయా మండలాల్లో తహశీల్దార్, ఎంపీడీఓ, సబ్ ఇన్‌స్పెక్టర్, నీటిపారుదల శాఖ ఇంజినీర్లు, గ్రామాల్లోని వీఆర్‌లతో కూడిన బృందాలను ఏర్పాటు చేశాం. కేవలం తాగునీటి అవసరాల కోసమే ఈ నీటిని వినియోగించాలని అన్ని విభాగాల అధికారులకు దిశానిర్దేశం చేశాం. జిల్లాలోని ప్రజల తాగునీటి అవసరాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం.

– ఏఎస్.దినేష్ కుమార్, కలెక్టర్

పూర్తి స్థాయిలో తాగునీటి చెరువులు నింపుతున్నాం



సాగర్ కుడి కాలువ ద్వారా జిల్లాకు వస్తున్న నీటితో పూర్తి స్థాయిలో తాగునీటి చెరువులు నింపుతున్నాం. కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు జిల్లాలోని సంబంధిత విభాగాలకు చెందిన అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. జిల్లాకు రానున్న 5 టీఎంసీల సాగర్ నీటిని వృథా చేయకుండా తాగునీటి చెరువులను పూర్తి స్థాయిలో నింపుకోవాలని ఆదేశించారు. అందుకోసం వివిధ విభాగాల అధికారుల సమన్వయంతో నీటిని సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాం. జిల్లాలోని మొత్తం 98 గ్రామీణ తాగునీటి చెరువులు, నాలుగు ఎస్ఎస్ ట్యాంకులు నింపేలా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాం.

– మర్దన్ అలీ, ఎస్ఈ, ఆర్‌డబ్ల్యూఎస్

న్యూస్‌రీల్

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన మంత్రి సురేష్



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: మెరుగైన వైద్యం కోసం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.4.06 లక్షల చెక్కులను రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ శనివారం తన క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. మండలంలోని అమానిగుడిపాడు గ్రామానికి చెందిన కె.బ్రహ్మయ్యకు రూ.2 లక్షలు, పందివానిపల్లెకు చెందిన బత్తుల రామిరెడ్డికు రూ.20 వేలు, పుల్లలచెరువు మండలంలోని రాచకొండ గ్రామానికి చెందిన తొంట్ల వెంకటలక్ష్మమ్మకు రూ.30 వేలు, పుల్లలచెరువు ఎస్సీ కాలనీకి చెందిన లింగంగుంట్ల చిన్న పెద్దక్కకు రూ.18 వేలు, పుల్లలచెరువుకు చెందిన బంది శివకుమారికు రూ.35 వేలు, పెద్దారవీడుకు చెందిన మామిడికాయల ఈశ్వరమ్మకు రూ.18 వేలు, గుంటూరు, కృష్ణా జిల్లాలకు చెందిన మరో ఇద్దరికి రూ.85 వేలు ప్రకారం ఆయన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, యర్రగొండపాలెం, పుల్లలచెరువు మండలాల పార్టీ అధ్యక్షులు కొప్పర్తి ఓబులరెడ్డి, బి.వి.సుబ్బారెడ్డి, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు డి.సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

పుల్లలచెరువు ఎంపీపీ రాజీనామా



సీఈఓకు రాజీనామా లేఖ అందజేస్తున్న ఎంపీపీ లాజర్

పుల్లలచెరువు: పుల్లలచెరువు ఎంపీపీగా పనిచేస్తున్న మందా లాజర్ శనివారం రాజీనామా చేశారు. ఎంపీపీ లాజర్ మాట్లాడుతూ తన వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లుగా ఆయన తెలిపారు. రాజీనామా లేఖను సీఈఓకు ఒంగోలులో అందజేశారు. జిల్లా అధికారులు ఎంపీపీ రాజీనామాను ఆమోదించినట్లుగా తెలిసింది.

సౌత్‌జోన్ హాకీకి మైనంపాడు విద్యార్థిని



సౌత్‌జోన్ హాకీకి ఎంపికైన క్రీడాకారిణి భవ్యశ్రీ

చీమకుర్తి: సౌత్‌జోన్ హాకీ టోర్నమెంట్ హాకీ పోటీలకు సంతనూతలపాడు మండలం మైనంపాడు ప్రభుత్వ జూనియర్ కాలేజీకి చెందిన ఆకుల భవ్యశ్రీ ఎంపికైనట్లు పీఈటీ రవికుమార్ శనివారం తెలిపారు. ఈనెల 17 నుంచి 24 వరకు చెన్నైలో జరిగే పోటీల్లో పాల్గొంటుందన్నారు. ఈ సందర్భంగా భవ్యశ్రీని హెచ్ఎం, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

ఆంధ్ర క్రికెట్ జట్టుకు లేఖజ్‌రెడ్డి



లేఖజ్‌రెడ్డి (ఫైల్)

బేస్తవారిపేట: బేస్తవారిపేటలోని రెడ్డినగర్‌కు చెందిన మిట్టా లేఖజ్ రెడ్డి ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అండర్-23 టీమ్‌కు ఎంపికయ్యాడు. శుక్రవారం ఏసీఏ (ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్) విడుదల చేసిన జాబితాలో వికెట్ కీపర్‌గా ఎన్నికయ్యాడు. గతంలో లేఖజ్ రెడ్డి అండర్-16, 19 విభాగాల్లో రాష్ట్ర జట్టులో వికెట్ కీపర్, బ్యాట్స్‌మెన్‌గా ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ టోర్నమెంట్ బరోడాలో జరిగిన మ్యాచ్‌కు ఎంపికై ప్రతిభచూపాడు. ఏసీఏ 2023-24 సీజన్ ఒన్‌డే క్రికెట్‌కు ఎంపిక కావడంతో తల్లిదండ్రులు మిట్టా చంద్రశేఖర్‌రెడ్డి, ధనలక్ష్మి, క్రీడాభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీ సింగిల్‌గా పోటీకి ఎందుకు భయం

- టీడీపీ, జనసేన కలిసినా గెలుపు మాదే
- చంద్రబాబుకు నిజంగా ఆరోగ్యం బాగా లేకపోతే ఆస్పత్రిలో వైద్యం చేయిస్తారు
- ఒకటి రెండు రోజుల్లోనే నకిలీ స్టాంపుల కుంభకోణంలో సిట్ నివేదిక వెల్లడి
- మీడియాతో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: తెలుగుదేశం పార్టీ ఎన్నో సంవత్సరాల నాటి పార్టీ. నిజంగా ఆ పార్టీకి సత్తా ఉంటే సింగిల్‌గా పోటీ చేసేందుకు ఎందుకు భయపడుతోందని మాజీమంత్రి, స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు.

శనివారం ఉదయం తన నివాసంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ గిద్దలూరు, దర్శి, ఒంగోలులో జనసేనకు ఉనికి ఉన్నా విజయం తమ పార్టీదే అని ధీమా వ్యక్తం చేశారు. చంద్రబాబు బరువు తగ్గారని టీడీపీ, కాదు బరువు పెరిగారని జైలు అధికారులు పేర్కొంటున్నారని.. నిజంగా చంద్రబాబుకు ఇబ్బందికర పరిస్థితి ఉంటే తప్పకుండా వైద్యశాలలో చికిత్స అందిస్తారన్నారు. అయితే ఇబ్బందికర పరిస్థితి ఉందన్న దానిలో నిజం లేదన్నారు. ఒంగోలులో వెలుగు చూసిన నకిలీ స్టాంపుల కుంభకోణానికి సంబంధించిన వేసిన సిట్ నివేదిక కూడా వచ్చినట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై కలెక్టర్, ఎస్పీలతో తాను మాట్లాడానని, కుంభకోణంలో ఎవరి పాత్ర ఉన్నా, ఏ పార్టీ వారు ఉన్నా సహించవద్దని సూచించానన్నారు. అయితే నివేదికను బహిర్గతం చేయడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారంటూ వారిని ప్రశ్నించానని, వారు ఒకటి రెండు రోజుల్లో వెల్లడించనున్నట్లు తెలిపారన్నారు. తప్పుచేయని కార్యకర్తలకు తప్పకుండా అండగా ఉంటానన్నారు. నిజంగా తప్పుచేసి ఉంటే మాత్రం వారిని తాను కాపాడేది లేదన్నారు.

14 మంది ప్రొఫెసర్ల నియామకం

మార్కాపురం: వచ్చే విద్యా సంవత్సరం నుంచి మార్కాపురంలో ప్రారంభం కాబోయే మెడికల్ కాలేజీకి సంబంధించి ఇప్పటి వరకూ రాష్ట్ర ప్రభుత్వం 12 మంది ప్రొఫెసర్లను, కళాశాల పరిపాలన అధికారిని, చీఫ్ బయో కెమిస్ట్రీని నియమించినట్లు జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్ సుబ్బారెడ్డి తెలిపారు. మొత్తం 330 పడకలు ఏర్పాటు చేస్తున్నామని, ఈ కళాశాలకు సంబంధించి 806 మంది సిబ్బంది ప్రభుత్వం నియమిస్తుందని అన్నారు. ఇందులో 484 మంది సిబ్బంది ఉంటారన్నారు. వీరిలో 222 మంది ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, స్టాఫ్ నర్సులు, పరిపాలనా సిబ్బంది, ల్యాబ్ టెక్నీషియన్లు, రేడియోగ్రాఫర్లు, ఆఫీస్ సిబ్బంది ఉంటారన్నారు. ఇప్పటికే ప్రిన్సిపల్‌గా డాక్టర్ శిరీష, మెడికల్ కళాశాల సూపరింటెండెంట్‌గా డాక్టర్ వనజ, పరిపాలనా అధికారిగా జి.వెంకటేష్‌ను నియమించడంతో వారు బాధ్యతలు స్వీకరించారని తెలిపారు.

స్టాఫ్ నర్సుగా ఉద్యోగం:

కొనకనమిట్ల మండలం నాగిరెడ్డిపల్లికి చెందిన కిడ్నీ బాధితుడు వేమా శ్రీనివాసులుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కలెక్టర్ దినేష్‌కుమార్ మార్కాపురం జిల్లా వైద్యశాలలో స్టాఫ్ నర్సుగా నియామక ఉత్తర్వులు అందించడంతో ఇక్కడ రిపోర్టు చేశాడని సూపరింటెండెంట్ సుబ్బారెడ్డి తెలిపారు.

వైఎస్ విజయమ్మకు ఆత్మీయ స్వాగతం



వైఎస్ విజయమ్మతో బాలినేని శ్రీనివాసరెడ్డి, ఆయన సతీమణి శచీదేవి, కుమారుడు ప్రణీత్‌రెడ్డి, వైవీ భద్రారెడ్డి సతీమణి రాధిక

ఒంగోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తల్లి వైఎస్ విజయమ్మకు మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి దంపతులు ఆత్మీయ స్వాగతం పలికారు. ప్రైవేటు కార్యక్రమం నిమిత్తం విజయమ్మ శుక్రవారం ఒంగోలుకు వచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం ఆమెను అల్పాహారానికి బాలినేని శ్రీనివాసరెడ్డి ఇంటికి ఆహ్వానించారు. దీంతో విజయమ్మ, ఆమెతోపాటు అద్దంకి వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ మాజీ చైర్మన్ వైవీ భద్రారెడ్డి సతీమణి రాధిక కూడా వచ్చారు. బాలినేని ఇంట అల్పాహారం తీసుకుంటూ వైఎస్ విజయమ్మ అందరినీ పేరుపేరునా ఆప్యాయంగా పలుకరించారు. బాలినేని శ్రీనివాసరెడ్డి, ఆయన సతీమణి శచీదేవి, వారి కుమారుడు ప్రణీత్‌రెడ్డిలు వైఎస్ విజయమ్మతో ఆత్మీయతను పంచుకున్నారు. వైఎస్ విజయమ్మను ఒంగోలు మేయర్ గంగాడ సుజాత కలిసి సన్మానించారు.



వైఎస్ విజయమ్మకు మొక్క అందజేసి సత్కరిస్తున్న ఒంగోలు మేయర్ గంగాడ సుజాత

పెళ్లి చేయడంలేదని..

- తండ్రిని చంపిన తనయుడు
- ఆపై తానూ గొంతుకోసుకుని ఆత్మహత్యాయత్నం

మార్కాపురం రూరల్: తనకు పెళ్లికాకుండా అడ్డుకుంటున్నాడనీ, పెళ్లి చేయడం లేదని ఆగ్రహంలో కన్నతండ్రిని కుమారుడు కత్తితో గొంతుకోసి చంపిన సంఘటన మార్కాపురం మండలంలోని రాయవరం గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత జరిగింది. మార్కాపురం రూరల్ ఎస్సై వెంకటేశ్వర నాయక్ తెలిపిన వివరాల ప్రకారం రాయవరం గ్రామంలోని కనకదుర్గ కాలనీకి చెందిన పత్తిపాటి బాల భద్రాచారి (57), భార్య లక్ష్మీకాంతమ్మకు కుమారుడు గురునారాయణతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు పదో తరగతి పూర్తయిన తరువాత వడ్రంగి పనిచేసుకుంటూ తండ్రికి చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. అయితే 25 ఏళ్లు వచ్చినా తనకు పెళ్లి చేయడం లేదని తల్లిదండ్రులతో తరచుగా గొడవపడుతున్నాడు. వచ్చిన సంబంధాలను కూడా తిరస్కరిస్తున్నారని డిప్రెషన్‌కు గురైన గురునారాయణ శుక్రవారం అర్ధరాత్రి 2 గంటల తరువాత తండ్రిని బహిర్భూమికి తోడుగా తీసుకునివెళ్లి గొంతుకోశాడు. రక్తం మడుగులో భద్రాచారి సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. అనంతరం గురునారాయణ అదే కత్తితో తన గొంతు కోసుకున్నాడు. ఆ సమయంలో అందరూ నిద్రలో ఉన్నారు. ఒక్కసారిగా కేకలు విని గ్రామస్తులు బయటకు వచ్చారు. జరిగిన సంఘటనను చూసి కుటుంబ సభ్యులకు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా వైద్యశాలకు తరలించారు. తన కుమారుడు ఇలా చేస్తాడని ఊహించలేదని లక్ష్మీ కాంతమ్మ భర్త మృతదేహాన్ని పట్టుకుని విలపించింది. కాగా గురునారాయణకు మార్కాపురం జిల్లా వైద్యశాలలో ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనా స్థలాన్ని డీఎస్పీ వీరరాఘవరెడ్డి, మార్కాపురం ఇన్‌చార్జి సీఐ రాజేష్ తదితరులు పరిశీలించారు.



భద్రాచారి మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ, సీఐ, ఎస్సైలు



చికిత్స పొందుతున్న గురునారాయణ

జిల్లాపై సీఎంకు ప్రత్యేక ప్రేమ

- కిడ్నీ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు ద్వారా పశ్చిమ ప్రకాశానికి మహద్భాగ్యం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి

ఒంగోలు: దశాబ్దాలుగా పట్టిపీడిస్తున్న ఫ్లోరైడ్ సమస్య శాశ్వత పరిష్కారానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన కిడ్నీ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు పశ్చిమ ప్రకాశానికి ఒక మహద్భాగ్యం అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో నత్తనడకన సాగిన వెలిగొండ ప్రాజెక్టును వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక వడివడిగా పూర్తిచేసి జిల్లా ప్రజలకు అంకితం ఇచ్చేందుకు ఇప్పటికే సీఎం ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారన్నారు. దీనివల్ల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించినా కిడ్నీ వ్యాధులకు సంబంధించి ఇంకా ఇతరత్రా సమస్యలు ఏమైనా ఉన్నాయా అనేది గుర్తించి వాటిని శాశ్వతంగా పరిష్కరించేందుకు ఈ పరిశోధన కేంద్రం ఎంతగానో దోహదపడుతుందన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారంభించి పేద ప్రజలు మంచి వైద్యాన్ని ఉచితంగా పొందేందుకు అవకాశం కల్పిస్తే, ఆయన కుమారునిగా ఆయన ఆశయాల సాధనే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మరో పది అడుగులు ముందుకేసి కిడ్నీ వ్యాధుల సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు కిడ్నీ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించడాన్ని పార్టీలకు అతీతంగా ప్రజలు హర్షిస్తున్నారన్నారు. దీని ద్వారా ప్రకాశం జిల్లాపై సీఎంకు ఎంతటి ప్రత్యేక ప్రేమ ఉందో ప్రజలు గమనించాలని కోరారు.

అభివృద్ధే సీఎం లక్ష్యం



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

● మంత్రి ఆదిమూలపు సురేష్

పెద్దారవీడు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాలు అభివృద్ధి చెందాయని, ప్రతి గడపలోనూ సంతోషం వెల్లివిరుస్తోందని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మండలంలో గొబ్బూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. మండల స్థాయి అధికారులతో కలిసి గడప గడపకు వెళ్లి వారికి నాలుగేళ్లలో ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరిస్తూ సంక్షేమ పథకాల బుక్‌లెట్లను అందజేశారు. స్థానికులు పలు సమస్యలను మంత్రికి తెలియజేయడంతో వెంటనే సంబంధిత అధికారులను సమస్యలను పరిష్కరించేందుకు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మంత్రి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన కొనసాగుతోందన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారుల చెంతకే సంక్షేమ ఫలాలు వెళ్తున్నాయని చెప్పారు. అభివృద్ధికి అవసరమైన విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తూ పాలన కొనసాగుతోందన్నారు. చంద్రబాబునాయుడు గత ఎన్నికల్లో ఇచ్చిన 600 హామీలను మాఫీ చేసి ప్రజలకు వెన్నుపోటు పొడిచారన్నారు. మరోసారి మభ్య పెట్టడానికి నేడు ప్రజల ముందుకు వస్తున్నారని చెప్పారు. చంద్రబాబు పాలనలో పేదలకు ఒక్క రూపాయి ఒరిగిందేమీ లేదన్నారు. పేదలకు సౌకర్యాలు కల్పిస్తున్న జగనన్నను కాదని దోచేసిన చంద్రబాబుకు ఓటు వేయగలమా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పాలిరెడ్డి కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ ఏర్వ చలమారెడ్డి, ఎంపీపీ బెజవాడ పెద్దగురవయ్య, వైస్ ఎంపీపీ గుండారెడ్డి యోగమ్మ, ఎంపీటీసీ దుదెకుల పకీరయ్య, సర్పంచులు అంగిరేకుల ఆదినారాయణ, గుడ్డెపోగు రమేష్, పాందుగుల వెంకటరెడ్డి, ఆదాము, తిరుమలనాథస్వామి ఆలయ చైర్మన్ దుద్దెల వెంకటరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ ఏర్వ వెంకటేశ్వరరెడ్డి, తహసీల్దార్ ఎంవీ కృష్ణారెడ్డి, ఎంపీడీఓ రాజ్‌కుమార్, ఏఈలు రమేష్, రవీంద్రరెడ్డి, డాక్టర్ ఎం వెంకటేశ్వర్లు, ఏపీఎం శ్రీనివాసులు, ఏఓ బుజ్జిబాయి, నాయకులు గుండారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, బత్తుల కాశయ్య, సొంటి నాగార్జునరెడ్డి, నరాల రామచంద్రయాదవ్, మూల సత్యంరెడ్డి, కాసు వెంకటరెడ్డి, బత్తుల సాలయ్య, వల్లెల ఈశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై సీఎం ప్రత్యేక శ్రద్ధ

- దశాబ్దాలుగా పశ్చిమ ప్రకాశాన్ని పట్టిపీడిస్తున్న ఫ్లోరైడ్ సమస్య
- కిడ్నీ వ్యాధులు, కీళ్ల సమస్యలతో జనం విలవిల
- అన్నింటికీ శాశ్వత పరిష్కారం చూపేందుకు కిడ్నీ వ్యాధుల పరిశోధన కేంద్రం ఏర్పాటు
- జిల్లాలో ఏర్పాటు చేయాలని ఆదేశించడం సీఎం ముందుచూపునకు నిదర్శనం
- దాదాపు రూ.450 కోట్లు వెచ్చించనున్నట్లు సమాచారం
- విలేకరుల సమావేశంలో వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, తదితరులు

ఒంగోలు: ప్రజారోగ్యంపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక శ్రద్ధ ఉందని వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి తెలిపారు. స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో పార్టీ వైద్య విభాగం ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో కిడ్నీ వ్యాధుల పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాలని సీఎం తీసుకున్న నిర్ణయాన్ని తాము స్వాగతిస్తూ సీఎంకు, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, మాజీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డికి జిల్లా ప్రజానీకం తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఫ్లోరైడ్ ప్రభావంతో పశ్చిమ ప్రాంత ప్రజానీకం దశాబ్దాలుగా తీవ్ర ఇబ్బందిపడుతోందన్నారు. అనేకమంది కిడ్నీల సమస్యతో విలవిల్లాడుతున్నారన్నారు. ఎంపీగా వైవీ సుబ్బారెడ్డి ఉన్న సమయంలో కనిగిరి, మార్కాపురం, ఒంగోలులో డయాలసిస్ సెంటర్లు కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కనిగిరి, మార్కాపురం, గిద్దలూరుతో పాటు సింగరాయకొండలో కూడా కొన్ని గ్రామాల్లో ఈ ప్రభావం ఉందన్నారు. కిడ్నీ వ్యాధులతోపాటు ఎముకల వ్యాధులు కూడా వస్తున్నాయన్నారు. తాజాగా సెప్టెంబర్ 30వ తేదీ నుంచి నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష పథకంలో వచ్చిన రిపోర్టులను పరిశీలించిన సీఎం జిల్లాకు కిడ్నీ వ్యాధుల పరిశోధన కేంద్రం ప్రకటించారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 5,216 మెడికల్ క్యాంపులు నిర్వహించి 18,61,874 మందికి వైద్య పరీక్షలు చేశారని, వారిలో 27,833 మంది సీరియస్ వ్యాధులతో బాధపడుతుండగా, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం అందించేందుకు రిఫర్ చేశారని వివరించారు. ఈ కార్యక్రమం నవంబరు 10వ తేదీతో ముగియనుండగా, ప్రతి మండలంలో నెలకు నాలుగుసార్లు మెగా మెడికల్ క్యాంపులు నిర్వహించేలా సీఎం నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ఇది దేశ చరిత్రలోనే చారిత్రాత్మక నిర్ణయమని అన్నారు.

పేదల కోసం సీఎం తహతహ : యాదాల అశోక్‌బాబు

పేద ప్రజలు ఎదగాలని, సంతోషంగా ఉండాలని సీఎం నిత్యం తహతహలాడుతుంటారని ఆరోగ్యశ్రీ రాష్ట్ర స్పెషల్ ఆఫీసర్, వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ యాదాల అశోక్‌బాబు తెలిపారు. అందులో భాగంగానే విద్య, వైద్యానికి అత్యధిక నిధులు కేటాయిస్తున్నారన్నారు. ఆంధ్రకేసరి యూనివర్సిటీని పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయడం, మార్కాపురంలో మెడికల్ కాలేజీ, ఒంగోలు రిమ్స్‌లో ఎంఆర్ఐ, సీటీ స్కాన్ ఏర్పాటు చేయడం ప్రజలకు ఎంతో ఉపయోగకరమన్నారు. పశ్చిమ ప్రకాశంలోని నీటిలో టైటానియం, జింక్, తదితర ఖనిజాల వల్ల సమస్య వస్తుందని, ఇంకా ఏమైనా యాంటీబయాటిక్స్ అధిక వినియోగం వల్ల వస్తుందా, జల కాలుష్యం ప్రభావం ఏమైనా ఉందా అనేది కూడా ఈ రీసెర్చి సెంటర్ ద్వారా గుర్తించి కిడ్నీ వ్యాధుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని భావించిన సీఎం సంకల్పానికి చేతులెత్తి నమస్కరిస్తున్నామన్నారు.

వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ డాక్టర్ చిడితోటి జీవన్ మాట్లాడుతూ సాధారణంగా చక్కెర వ్యాధి, రక్తపోటుతో బాధపడేవారికి కిడ్నీల సమస్య తలెత్తుతుంటుందన్నారు. కానీ, పశ్చిమ ప్రకాశంలోని ప్రజానీకం అటువంటి వ్యాధులు లేకుండా కూడా రోగాలబారిన పడుతుండటంతో రీసెర్చి సెంటర్ ద్వారా మూలాలను గుర్తించి పరిష్కరించేందుకు సీఎం ఒక మంచి నిర్ణయం తీసుకున్నారన్నారు. జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నందకిషోర్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పశ్చిమ ప్రకాశం ప్రజలకు ఊహించని మేలు తీసుకొచ్చిందన్నారు. దాదాపు రూ.450 కోట్లతో కిడ్నీ వ్యాధుల పరిశోధన కేంద్రం ఏర్పాటు జరుగుతోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వైద్య విభాగం నగర అధ్యక్షుడు డాక్టర్ జాలాది మణిబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సునీల్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ పిల్లుట్ల సందీప్, తదితరులు పాల్గొన్నారు.

10 తులాల బంగారం, 50 తులాల వెండి చోరీ



దొంగలు పొలాల్లో పడేసిన చెక్క పెట్టెను పరిశీలిస్తున్న డీఎస్పీ వీరరాఘవరెడ్డి

కొమరోలు: మండలంలోని బ్రాహ్మణపల్లె గ్రామంలో గల ఓ ఇంట్లో శుక్రవారం అర్ధరాత్రి సమయంలో భారీ చోరీ జరిగింది. గ్రామానికి చెందిన పి.శేఖర్‌రెడ్డి తన కుటుంబంతో కలిసి శుక్రవారం రాత్రి ఆరుబయట నిద్రిస్తున్న సమయంలో ఇంటి వెనుక ఉన్న వాకిలిని పెకిలించి దొంగలు లోపలికి ప్రవేశించారు. బీరువా పగలగొట్టి అందులోని నగలు చోరీ చేశారు. 10 తులాల బంగారం, 50 తులాల వెండి చోరీ జరిగినట్లు శేఖర్‌రెడ్డి తెలిపాడు. ఒక చెక్క పెట్టెలో ఉన్న వెండిని చోరీ చేసి చెక్కపెట్టెను సమీపంలోని పంట పొలాల్లో పడేశారు. సమాచారం అందుకున్న మార్కాపురం డీఎస్పీ వీరరాఘవరెడ్డి, గిద్దలూరు సీఐ దేవప్రభాకర్ సంఘటన స్థలానికి చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. క్లూస్ టీం చేరుకుని వేలిముద్రలు సేకరించింది. శేఖర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక హెడ్ కానిస్టేబుల్ సలీమ్ కేసు నమోదు చేశారు.

ఆపస్ జిల్లా కార్యవర్గం ఎన్నిక



సమావేశంలో మాట్లాడుతున్న సంఘ సభ్యులు

ఒంగోలు సెంట్రల్: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఏపీయూఎస్) జిల్లా నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక ఏకేవీకే కళాశాలలో ఆపస్ జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సంఘ ఎన్నికల అధికారి వెంకటేశ్వర రెడ్డి నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని ప్రకటించారు. సంఘ అధ్యక్ష, కార్యదర్శులుగా కే మల్లిఖార్జున రావు, దిలీప్ చక్రవర్తి, జిల్లా ఉపాధ్యక్షులుగా కె.శంకర రావు, వీవీఎస్ఎన్ మూర్తి, ఎం.గీత, బి. కళ్యాణ్, జిల్లా కోశాధికారిగా బీవీఎస్ గుణ ప్రసాద్, కార్యదర్శులుగా ఆర్.పెదరాయుడు, ఎంఎన్ఎస్ ఆంజనేయులు, పీఎల్ఎన్ ప్రసూన, వీ రమణయ్య, జె.రమాదేవి, కె.శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులుగా వీవీ నారాయణ, బి.చెన్నారెడ్డి, డి.అనురాధ, ఎం.సంధ్యారాణి, కె.జైహింద్ రెడ్డి, పి.లోకనాథం, కె.వి.సుబ్రహ్మణ్యం, టి. శేషారావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముందుగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను చర్చించారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

సింగరాయకొండ: భర్త, అత్త చిత్రహింసలు పెట్టడంతో వివాహిత చిమట చందన ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శనివారం సింగరాయకొండ మండల కేంద్రంలోని బైరాగిమాన్యంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పాతసింగరాయకొండకు చెందిన చిమట జయకృష్ణ బైరాగిమాన్యంలో నివసిస్తున్నాడు. కొంతకాలంగా భార్య చందనను తల్లి, పుష్పమ్మతో కలిసి మానసికంగా, శారీరకంగా జయకృష్ణ వేధిస్తున్నాడు. దీంతో చందన బాత్‌రూమ్‌లోని ఇనుపరాడ్డుకు చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్యకు యత్నించింది. స్నానానికని బాత్‌రూమ్‌లోకి వెళ్లిన చందన ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో అత్త పుష్పమ్మ బాత్‌రూమ్ తలుపుతీసే ప్రయత్నం చేయగా రాలేదు. దీంతో చుట్టుపక్కల వారి సహాయంతో బాత్‌రూమ్ డోర్ పగలగొట్టి చూడగా చందన ఉరేసుకుని అపస్మారక స్థితిలో ఉంది. దీంతో ఆమెను హుటాహుటిన స్థానిక ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తీసుకెళ్లారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్లు వివరించారు. చందన తండ్రి బత్తుల మాధవ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్సై టి.శ్రీరామ్ వివరించారు.

పాఠశాలలు తెరిస్తే కఠిన చర్యలు

ఒంగోలు: దసరా సెలవుల్లో పాఠశాలలు తెరిస్తే కఠిన చర్యలకు సిఫార్సు చేస్తామని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి శనివారం ఒక ప్రకటనలో పాఠశాలల యాజమాన్యాలను హెచ్చరించారు. ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వం కూడా నిబంధనలు జారీచేసిందన్నారు. ఈ విషయంలో ఎవరికీ ప్రత్యేక మినహాయింపులు ఉండవన్నారు. ఎక్కడైనా పాఠశాలలు తెరుస్తున్నట్లు గుర్తిస్తే చైల్డ్‌లైన్ నంబర్ 1092కు కాల్‌చేసి ఫిర్యాదు చేయవచ్చని ఆమె పేర్కొన్నారు.

అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ప్రవేశాలకు 20 వరకు గడువు

ఒంగోలు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఒంగోలు స్టడీ సెంటర్ బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 20వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు రీజినల్ కో ఆర్డినేటర్ ఎం.శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్ ద్వారా ఇంటర్ ఒకేషనల్ కోర్సు, ఓపెన్ స్కూల్ ద్వారా ఇంటర్ పాసైన వారు కూడా డిగ్రీలో చేరేందుకు అర్హులని తెలిపారు. డిగ్రీ పూర్తిచేసేందుకు 1991 నుంచి 2011 వరకు డిగ్రీలో చేరి మధ్యలో ఆపిన వారికి కూడా యూనివర్సిటీ అవకాశం కల్పించిందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పూర్తి వివరాలకు స్టడీసెంటర్‌లోగానీ, 73829 29613 సెల్ నంబర్‌నుగానీ సంప్రదించాలని సూచించారు.

వైఫల్యమే విజయానికి మొదటి మెట్టు

● రాష్ట్రపతి అవార్డు గ్రహీత డాక్టర్ రామారెడ్డి



విద్యార్థులతో రామారెడ్డి

ఒంగోలు అర్బన్: వైఫల్యమే విజయానికి తొలిమెట్టు అని, ఆ అనుభవంతో పట్టుదలతో ఎదగాలని రాష్ట్రపతి అవార్డు గ్రహీత డాక్టర్ కర్రి రామారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక స్పందన భవనంలో యోగా గురువు పతంజలి శ్రీనివాస్ పర్యవేక్షణలో నిత్య జీవితంలో విజయ సాధన అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రామారెడ్డి మాట్లాడుతూ ప్రతి విషయంలో సానుకూల దృక్పథాన్ని విద్యార్థి దశ నుంచే అలవరచుకోవాలన్నారు. ఎటువంటి భావోద్వేగాలకు లోనుకాకుండా సాధన చేయాలన్నారు. నాయకత్వ లక్షణాలు, కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకుంటే ఉన్నత స్థానాలకు ఎదగవచ్చన్నారు. విద్యార్థి దశ నుంచే మానవత్వం, సామాజిక స్పృహ, ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలన్నారు. డీఈఓ సుబ్బారావు మాట్లాడుతూ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదివే విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ర్యాంకు సాధిస్తే వారికి రూ.50 వేలు బహుమతి ప్రకటించారన్నారు. కార్యక్రమానికి ఇస్మాయిల్ వ్యాఖ్యాతగా వ్యవహరించగా, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.